

విద్యుతాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-తెర్లాం



మండలంలోని అంట్లవారి గ్రామంలో బుధవారం సాయంత్రం విద్యుతా ఘాతంతో రైతు కోట రామారావు (50) మృతి చెందాడు. పొలానికి వెళ్తున్న ఆయనకు తెగిపడి ఉన్న విద్యుత్తు వైర్ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రామారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయమై ఎలక్ట్రికల్ వివరణ కోరగా సర్వీస్ వైరు తెగిపడడంతో ఈ ఘటన జరిగిందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాగర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్రీహోల్డ్ పట్టాదారుల వివరాలు సేకరణ

- రికార్డుల వారీగా తనిఖీ చేయాలని ప్రొఫార్మా పంపిణీ
- కొనుగోలుదారుల వివరాలూ సేకరించాలని ఆదేశం
- విచారణ ప్రారంభించిన రెవెన్యూ అధికారులు



బసవపాలెంలో డి-పట్టా భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న సిసోడియా (ఫైల్)

ప్రజాశక్తి-భోగాపురం

గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన ఫ్రీహోల్డ్ పట్టాల పంపిణీకి సంబంధించిన వివరాలను రికార్డుల వారీగా సేకరించాలని ప్రభుత్వం రెవెన్యూ అధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించి రికార్డు వారీగా పరిశీలన పేరుతో ప్రొఫార్మాను కూడా రూపొందించింది. వాటిని రెవెన్యూ అధికారులకు అందజేసింది. ఈ ప్రొఫార్మాలో సంబంధిత వివరాలను నమోదు చేయాలని ఆదేశించింది. ఇందులో ఏమైనా లొసుగులు ఉంటే తెలియజేయాలని సూచించింది. దీంతో ఫ్రీహోల్డ్ పట్టా అందుకున్న ప్రతీ లబ్ధిదారుడి వివరాలను రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా సేకరిస్తున్నారు.

గతంలోని ప్రభుత్వాలు డి-పట్టా భూములను పేదలు సాగు చేసుకునేందుకు పంపిణీ చేశాయి. ఈ భూములు అమ్ముకునేందుకు వీల్లేదు. కేవలం సాగు చేసుకునేందుకు మాత్రమే వీలుపడేది. కాని ఇలాంటి భూములను రైతులు అమ్ముకునేందుకు వీలుగా గత వైసిపి ప్రభుత్వం జిరాయితీ భూమిగా మార్చి ఫ్రీ హోల్డ్ పట్టాలను పంపిణీ చేసింది. ఈ విషయం ముందుగా తెలుసుకొన్న బడాబాబులు డి-పట్టా భూములను భారీగా కొనుగోలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతేకాక గత ప్రభుత్వ హయాంలోని మాజీ సిఎస్ జవహర్‌రెడ్డి బినామీలు ఈ భూములను ఎక్కువగా కొనుగోలు చేశారంటూ ఆరోపణలు వచ్చాయి. భోగాపురం, పూసపాటిరేగ, విశాఖ జిల్లాలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో మాజీ సిఎస్ బినామీలు కొనుగోలు చేసినట్లు అనేక సార్లు మీడియా సమావేశంలో వెల్లడించారు. దీంతో కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ భూములపై ప్రత్యేక దృష్టి సారించింది. డి-పట్టా భూములను గత ప్రభుత్వ హయాంలో జిరాయితీగా మార్పుచేసి రైతులకు అందజేశారు. కాని ఈ భూముల వ్యవహారంలో అవకతవకలు జరిగాయని అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో ఇటీవల రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.పి.సిసోడియా జిల్లాలో పర్యటించిన విషయం తెలిసిందే. అంతేకాక ఫ్రీహోల్డ్ పట్టాలు ఇచ్చిన భూములను సైతం జిల్లాలోని భోగాపురం, వేపాడ మండలాల్లో పర్యటించి పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు జరగడంతో సంబంధిత సబ్ రిజిస్టార్ కార్యాలయాలకు వెళ్లి రికార్డులను సైతం తనిఖీ చేశారు.

పూర్తి వివరాలు సేకరణ

రాష్ట్రంలో తహశీల్దార్ల బదిలీలు పూర్తికావడంతో కొత్తగా వచ్చిన తహశీల్దార్లతో ప్రభుత్వం ఈ విచారణ ప్రారంభించింది. ప్రభుత్వం ఫ్రీహోల్డ్ పట్టాలు పొందిన రైతులతోపాటు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి వివరాలను సైతం సేకరించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఒక ప్రొఫార్మాను తయారు చేసి పంపించింది. ఇందులో అనేక అంశాలను పొందు పరిచింది. అందులో కొన్ని...

గతంలో డి-పట్టాల భూములు పొందిన లబ్ధిదారుల వివరాలతోపాటు వారి ఫోను నంబర్, సర్వే నంబర్, ఆధార్ నంబర్, ఏ సంవత్సరంలో ప్రభుత్వం నుంచి భూములు పొందారో వివరాలు నమోదు చేయాలి. భూములు పొందిన వారు కాకుండా వేరేవాళ్లు అందులో ఉంటే వారి వివరాలు లేదా వారి వారసులుంటే వారి వివరాలు నమోదు చేయాలి. డి-పట్టా భూములు 22ఎలో ఉన్నాయా లేదా ఫ్రీహోల్డ్ పట్టాలు ఇచ్చిన తరువాత 22ఎ నుంచి తొలగించి ఉంటే అది కూడా నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఫ్రీహోల్డ్ పట్టాలు పొందిన తరువాత రిజిస్ట్రేషన్లు ఎక్కడ జరిగాయి, సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ పేరు, ఏ తేదీన రిజిస్ట్రేషన్ చేశారు, డాక్యుమెంటు నంబరు, మార్కెట్ ధర వంటి వివరాలను కూడా పూర్తి స్థాయిలో ప్రొఫార్మాలో నింపాలి.ఆ భూములను ఎవరు కొనుగోలు చేశారనేది డాక్యుమెంటు ప్రకారం వారి పేర్లు కూడా అందజేయాలని ప్రభుత్వం సూచించింది.ఈ ఫ్రీహోల్డ్ పట్టాల లబ్ధిదారుల ఎంపిక చట్ట పరిధిలోనే నిబంధనలకు అనుగుణంగా జరిగిందా? లేదా? తెలియజేయాలని కోరింది. దీంతో రెవెన్యూ అధికారులు సంబంధిత వివరాలను సేకరిస్తున్నారు.

మేయర్ దరఖాస్తునే తిరస్కరిస్తారా?

- ఎమినిటీ కార్యదర్శికి ఎంత దమ్ము?
- ప్రొటోకాల్ అమలు కాకపోవడంపై కార్పొరేటర్ల ఆగ్రహం
- మా పనితీరు నచ్చకుంటే సెలవుపై వెళ్లిపోతా : కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

'సాక్షాత్తు మేయర్ కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తు పంపిస్తే ఎమినిటీ కార్యదర్శి తిరస్కరించడానికి ఎంత దమ్ము? ప్రభుత్వం చేపడుతున్న మా మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించడం లేదు. అధి ప్రభుత్వ కార్యక్రమమా, లేదా పార్టీ కార్యక్రమమా? అధికారులు సమాధానం చెప్పాలి' అంటూ నగర పాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశంలో కార్పొరేటర్లు అధికారులను ప్రశ్నించారు. బుధవారం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో అజెండాలోకి వెళ్లేముందు జీరో అవర్ లో కార్పొరేటర్ అల్లు చాణక్య ముందుగా సమస్యలపై కౌన్సిల్ లో లేవనెత్తారు. మా మంచి ప్రభుత్వం కార్యక్రమం స్థానిక కార్పొరేటర్లు అగౌర పరిచే విధంగా జరుగుతుందన్నారు. మేయర్ కే గౌరవం ఇవ్వడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవాలన్నారు. 1965 మున్సిపల్ చట్టం ప్రకారం కుళాయి కనెక్షన్లు ఇచ్చే అధికారం కార్పొరేటర్లకు ఉందని, కానీ ఇటీవల సచివాలయాల ద్వారా కుళాయి కనెక్షన్లకు దరఖాస్తులు స్వీకరించడం, దళారులు ద్వారా వచ్చే దరఖాస్తులు ఇవ్వొద్దని కమిషనర్ చెప్పడం మమ్మల్ని అవమానించినట్లేనని అన్నారు. ఆ మాటలు వెనక్కి తీసుకోవాలని కార్పొరేటర్లు ప్రభాకరరావు, ఆశపు వేణు ,గాధం మురళీ, 38 వ డివిజన్ కార్పొరేటర్, ఎన్ని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కుళాయి కనెక్షన్లు కార్పొరేటర్లు ద్వారా మంజూరు చేయాలనీ లేకుంటే ఊరుకునేది లేదని అన్నారు.

స్పందించిన కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ సభ్యులను అగౌరవ పరిచే విధంగా వ్యవహరించే అవకాశం లేదన్నారు. ప్రోటోకాల్ ప్రకారం మా మంచి ప్రభుత్వం అనేది జరుగుతోందన్నారు. మేయర్ ఇచ్చిన దరఖాస్తు ను రిజెక్ట్ చేసిన ఎమినెంట్ కార్యదర్శి పై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాప్రతినిధులను అగౌరవ పరిచేలా తన తీరు ఉందంటే తాను సెలవు పెట్టి వెళ్లిపోతానని కమిషనర్ అన్నారు. మూడు నెలలు సమయమిస్తే పాలన గాడిలోపెట్టి నగరాభివద్ధికి మీ సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.



కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న కార్పొరేటర్

వైసిపి కార్పొరేటర్ల తీరుపై ప్రశ్నించిన టిడిపి కార్పొరేటర్

గత మూడేళ్ల కాలంలో కుళాయి కనెక్షన్లు అన్నీ ఎమ్మెల్యే ఇంటి దగ్గర నుంచి దరఖాస్తులు ఇచ్చారని, కార్పొరేటర్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చే అవకాశం కూడా లేదని, చివరకు మేయర్ కు తెలియకుండానే అనేక పనులు జరిగాయని .. కానీ నేడు మా ద్వారా కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని వైసిపి కార్పొరేటర్లు వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని 49వ డివిజన్ టిడిపి కార్పొరేటర్ రాధామని అన్నారు. కనీసం ఒక్క బోరు కూడా తమ వార్డుల్లో వేయించుకునే పరిస్థితి లేదన్నారు. మా డివిజన్ పరిధిలో మెడికల్ కళాశాల పెడితే కనీసం ఆహ్వానించకపోగా, ప్రోటోకాల్ అని నేడు గగ్గోలు పెడుతున్న వైసిపి కార్పొరేటర్లు మెడికల్.కాలేజీ శిలాఫలకంపై తన పేరు ఎందుకు వేయించలేదని ప్రశ్నించారు.

ఎజెండా రూపకల్పన సరిగ్గా లేదు : కమిషనర్

అనంతరం ఈఅజెండాలోని అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు ఎజెండా రూపకల్పన సరిగ్గా లేదని కమిషనర్ నల్లనయ్య అన్నారు. స్టాండింగ్ కమిటీ ఆమోదించిన అంశాలను ముందుగా కార్పొరేటర్ల కు తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే సమావేశం నుంచి స్టాండింగ్ కమిటీ నిర్ణయాలు సభ్యులకు తెలియచేస్తామన్నారు.

ఎజెండాలోని పలు అంశాలు ఆమోదం

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో 21 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వీటిలో అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణ పనులు, ప్రహరీ గోడలు నిర్మాణానికి రూ.35 లక్షలు సాధారణ నిధులు నుంచి మంజూరు కోసం పెట్టిన అంశాన్ని కౌన్సిల్ వాయిదా వేసింది. మేయర్ అనుమతితో టేబుల్ అంశాలు కింద పెట్టిన ఆరు అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయా యాదవ్, అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, పలు శాఖల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విజన్ 2047లో భాగస్వాములు కావాలి

కమిషనర్ నల్లనయ్య



సభలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సలహాలు, సూచనలు ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య కోరారు. బుధవారం 47వ డివిజన్ కంటోన్మెంట్ పాఠశాలలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే పలు హామీలను అమలు చేశారన్నారు. ఘోషాసుపత్రి ఆవరణలో త్వరలో మరో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించ బోతున్నట్లు వెల్లడించారు. విజయవాడ వరదల్లో విజయనగరం నగరపాలక సంస్థ నుంచి 150 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహించి అందరి అభినందనలూ పొందారని అన్నారు. ముందుచూపుతో ప్రతి ఒక్కరూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తమ వంతు కషి చేస్తూ అమూల్యమైన సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యాన వివిధ క్రీడా అంశాల్లో ఎంపిక పోటీలు ఈ నెల 27 నుంచి అక్టోబర్ 1 తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో జరుగుతాయ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె. కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో 0-14, 0-17 బాల బాలికలు ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొనవచ్చునని తెలిపారు. 14ఏళ్లలోపు వారు 1-12011 తరువాత జన్మించినవారై ఉండాలలని, 17ఏళ్లలోపు వారు 1-1-2008 తరువాత జన్మించినవారు అర్హులని తెలిపారు. 27న క్రికెట్ అండర్ 14 బాలుర పోటీలు విజ్జీ స్టేడియంలోను, టేబుల్ టెన్నిస్ పి ఎస్ఆర్ స్కూల్, 28న క్రికెట్ అండర్ 17 బాలురు,బాలికల పోటీలు, అదే రోజు సెపక్‌థక్రా అండర్ 14,17 విటి అగ్రహారం జెడ్‌పి హైస్కూలులోను, రగ్బీ జెడ్‌పి హైస్కూలు గరుగుబిల్లి, బాస్కెట్‌బాల్ కొత్తవలస లోని జిందాల్ పబ్లిక్ స్కూల్ లోను జరుగుతాయని తెలిపారు. అథ్లెటిక్స్ అండర్ 14,17 బాల, బాలికల పోటీలు విజ్జి స్టేడియంలోను, 30న బేస్‌బాల్ పోటీలు బాడంగి జెడ్‌పి హైస్కూలులోను, 1న బాల్ బ్యాడ్మింటన్ పోటీలు విజ్జీ స్టేడియంలోను, ఫెన్సింగ్ పోటీలు ఎస్ కోట హై స్కూల్, స్విమ్మింగ్ అక్వా కాంప్లెక్సు జరుగుతాయని తెలిపారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ఉచిత న్యాయ సహాయం పొందండి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ఏడాదికి రూ.3లక్షలు లోపు ఆదాయం గల వారు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు, పూర్వ జిల్లా జడ్జి జి.దుర్గయ్య తెలిపారు. బుధవారం న్యాయాధికారసంస్థ కార్యాలయంలో జరిగిన న్యాయ అవగాహనసదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్, విద్యా హక్కు చట్టం, ఉచిత నిర్బంధ విద్యతదితర అంశాలపై వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. విజయ కళ్యాణి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. టీచర్స్ మరియు ప్రజలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలెప్పుడు?

కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నిరసన


ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదేశాలతో 'థాలీ బజావో' కార్యక్రమం చేపట్టారు. స్టీల్ కంచాలు మోగిస్తూ సూపర్ సిక్స్ ఎక్కడ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు విద్యాసాగర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తామని చెప్పిన పథకాలను నేటికీ అమలు చేయలేదన్నారు. పతి ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని మహిళలను మభ్య పెట్టారన్నారు, విద్యార్థులకు ఇచ్చే తల్లికి వందనం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు వంటి ఊసే లేదన్నారు. రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం సంగతేంటి అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకలు డాక్టర్ గేదెల తిరుపతి, సుంకరి సతీష్ కుమార్, షరీఫ్, కరీం, శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, బంగారు నాయుడు, ఎన్ఎస్‌యుఐ నాయకులు సుంకరి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా నూతన బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టి. శ్రీనివాసరావు, జి.లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఎన్నికలకు రాష్ట్ర పరిశీలకులు మురళీరాజు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం నుంచి పరిశీలకులుగా రవి హాజరయ్యారు. కమిటీ సభ్యులుగా గౌరిమణి, నాగమణి, సింహాచలం, సతీష్, రవికుమార్, రాజేష్, గోవింద్ ఎన్నికయ్యారు.



శ్రీనివాసరావు, జి.లక్ష్మణరావు

లోకేష్‌ను కలిసిన ఎంపి కలిశెట్టి

విజయనగరంకోట : విశాఖపట్నం పర్యటన నిమిత్తం విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం ఎయిర్‌పోర్టులో మర్యాద పూర్వకంగా కలిశారు. భగవద్గీత పుస్తకం అందించి స్వాగతం పలికారు. కార్పొరేషన్ పదవుల్లో సామాన్య కార్యకర్తలకు చోటు కల్పించినందుకు తజ్ఞతలు తెలిపారు.

6,7,8 తేదీల్లో ఎపిటిఎఫ్ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అక్టోబర్ 6,7,8 తేదీల్లో విజయనగరం లో జరగనున్న ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు కోరారు. బుధవారం జిల్లా శాఖా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభల్లో సంఘం లక్ష్యాలు, విద్యా ప్రగతి, ఉపాధ్యాయుల సంక్షేమం, మహిళా సాధికారిత, పింఛను విధానం,నూతన విద్యా విధానంపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని తెలిపారు. ఫూల్‌బాగ్ కాలనీ సమీపంలోని జగన్నాథ ఫంక్షన్ హాల్లో మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈ సభలకు మేధావులు, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు.సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులు ఎ.సదాశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బలరామినాయుడు, ఎన్ వై పైడిరాజు, కె.సత్యం పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేస్తా..

డిసిసి అధ్యక్షులు విద్యాసాగర్



డిసిసి అధ్యక్షులు విద్యాసాగర్‌ను అభినందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

పార్టీ కార్యకర్తలను, నాయకులను కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తానని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమితులైన ఎం.విద్యాసాగర్ అన్నారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. డిసిసి మాజీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ విద్యాసాగరకు పదవీ బాధ్యతలు అప్పజెప్పి దుశ్సాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు నియోజకవర్గాల నుంచి విచ్చేసిన పార్టీ నాయకులు కార్యకర్తలు విద్యాసాగర్‌ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. జిల్లాలో ఉన్న నాయకులందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానన్నారు. పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు సుంకర సతీష్ కుమార్, మైనార్టీ రాష్ట్ర మాజీ నాయకులు షరీఫ్, మాజీ ట్రైనింగ్ సెల్ చైర్మన్ డోల శ్రీనివాసరావు, బంగారు నాయుడు, డాక్టర్ గేదెల తిరుపతి, జమ్ము ఆదినారాయణ, ఎస్. శ్రీనివాసరావు, కరీం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో కళా ప్రదర్శనలకు అవకాశం

28 వరకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 13, 14 తేదీలలో స్థానిక ఆనంద గజపతి కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెన్యూఇన్‌ఛార్జి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఉమా శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన దలచిన వారు తమ వివరాలను స్థానిక మహారాజా సంగీత నృత్య కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపల అందజేయాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ కు సెప్టెంబరు 28 వ తేదీ ఆఖరు తేదీయని, గడువు తర్వాత అందిన దరఖాస్తులు స్వీకరించ బడవని తెలిపారు. క్లాసికల్ , సెమి క్లాసికల్ , భక్తి సంగీతం భృంద నృత్యాలకు మాత్రమే అవకాశం ఉందని, ప్రతి బృందం ప్రదర్శనకు 15 నిముషాలు లోపల సమయం కేటాయిస్తామని తెలిపారు. ఎంపిక చేసిన బృందాలకు ప్రదర్శించ వలసిన తేదీ, సమయం ఫోన్ ద్వారా తెలియజేస్తామన్నారు.

'సీతం' విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి-విజయనగరం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

సీతం కళాశాల విద్యార్థులు బుధవారం రక్తదానం చేశారు. సుమారు వెయ్యి మంది విద్యార్థులు రక్తదానం చేశారు. డాక్టర్ మహేష్ ఆధ్వర్యాన రోటరీ సిబ్బంది రక్తం సేకరించారు. రక్తదాతలకు పండ్లు, బ్రెడ్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశి భూషణరావు మాట్లాడుతూ సేవాభావం, అంకితభావంతో నిత్యం ఇలాంటి అవగాహన శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రక్తదానం యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తారని అన్నారు. కార్యక్రమంలో . కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సతీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వెంకట లక్ష్మి, రోటరీ క్లబ్ సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి బీమా అందజేత

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రమాదవశాత్తూ మరణించిన హోంగార్డు కుటుంబానికి శాలరీ ప్యాకేజి ఇన్సూరెన్సుగా యాక్సిస్ బ్యాంకు మంజూరు చేసిన రూ.38 లక్షల చెక్ ను హోంగార్డు కుటుంబానికి బుధవారం ఎస్‌పి వకుల్ జిందాల్ అందజేశారు. జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా పని చేస్తున్న జి. వెంకట సత్యం విద్యుత్ ఘాతంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకుగాను యాక్సిస్ బ్యాంకు అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపగా, సేలరీ ప్యాకేజ్ స్కీంలో భాగంగా ఆయన కుటుంబానికి రూ.38 లక్షలను ఇన్సూరెన్సుగా బ్యాంకు అధికారులు మంజూరు చేసారన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మరణించిన వెంకట సత్యం సతీమణి పార్వతికి బ్యాంకు అధికారుల సమక్షంలో ఎస్‌పి అందజేశారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, యాక్సిస్ బ్యాంకు మేనేజరు విశ్వకళ్యాణ్, ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, యాక్సిస్ బ్యాంకు ఉద్యోగి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆనందగజపతి ఆడిటోరియంలో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కమిషనర్ పి .నల్లనయ్య ఆదేశాల మేరకు ప్రజారోగ్యశాఖ అధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు పారిశుధ్య కార్మికులు ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ నగరంలో ఉన్న మురికి, చెత్తాచెదారాలను పరిశుభ్రపరచడం వల్ల వ్యక్తిగత ఇబ్బందులకు పారిశుధ్య కార్మికులు గురవుతుంటారని తెలిపారు. అందువల్ల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

నృత్య పోటీల్లో గురజాడ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'అక్షయ సోషల్ కల్చరల్ అసోసియేషన్ అన్నవరంలో నిర్వహించిన నృత్యోత్సవ పోటీలలో గురజాడ పాఠశాలకు చెందిన 7 వ తరగతి విద్యార్థినులు ఎ. కేతన కుమారి, ఎ .కుందన గ్రూప్ డాన్స్ లో ప్రథమ బహుమతి పొందారు. వీరికి షీల్డు, గోల్డుమెడల్‌ను నిర్వాహకులు అందించారు. ఈ సందర్భంఅ విద్యార్థినులను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎం వి జి అర్ కృష్ణాజీ , కరస్పాండెంట్ ఎం. స్వరూప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ అభినందించారు.

వెంకట్ కుటుంబానికి న్యాయం చేయాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీ పారిశుధ్య కార్మికుడు బొమ్మాళి వెంకట్ కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు నాయకులు బిడి రమణ, ఎ. జగన్ మోహన్ రావు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నెల్లిమర్ల నగర పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో బొమ్మాళి వెంకట్ సంతాప సభ యూనియన్ నాయకులు హరిబాబు అధ్యక్షతన ఇఫ్టు ఆఫీస్‌లో నిర్వహించారు. ముందుగా వెంకట్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ బొమ్మాళి వెంకట్ అనేక నెలలు జీతం లేకుండా పారిశుధ్య పని చేశారని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు నుంచి ఒక్కొక్కరు రూ.500లు ఆర్థిక సహకారం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు, ఇఫ్టు నాయకులు అప్పలసూరి, యూనియన్ నాయకులు బాబూరావు, శ్రీను, లక్ష్మి, సురేష్, ఉమా, రాము, బాల, గౌరి, కార్మికులు పాల్గొన్నారు.

అమ్మకానికి 'ఉపాధి' గునపాలు

శృంగవరపుకోట: ఉపాధి హామీ ద్వారా పనులు చేసే కూలీలకు ఇవ్వాల్సిన గునపాలు బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న రైతులు వాటిని తరలిస్తున్న ఆటోను బుధవారం అడ్డగించారు. ఈ విషయంపై ఏపీ గిరిజన సంఘం నాయకుడు జరత గౌరీష్ మాట్లాడుతూ మండలంలోని మూల బొడ్డవర పంచాయతీ బొడ్డవర గ్రామంలోని రామమందిరం వద్ద ఎన్ఆర్ఇజిఎస్ ముద్రతో ఉన్న సుమారు 35 గునపాలను ఆటోలో తీసుకెళ్లి అమ్ముతున్నారన్న సమాచారం తెలియడంతో రైతులతో కలిసి ఆటోను అడ్డుకున్నామన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ ముద్రతో ఉన్న గునపాలు ఎక్కడివని ప్రశ్నించగా ఒక్కొక్క గునపం రూ.400 చొప్పున కొనుగోలు చేశానని మీకు కావాలిస్తే అమ్ముతానని ఆటో డ్రైవర్ బదులిచ్చాడన్నారు. ఉపాధి పనుల్లో పనిముట్లు లేక కూలీలు నానా ఇబ్బందులు పడుతుంటే వీటిని బ్లాక్ మార్కెట్లో ఎలా అమ్ముకుంటారని అధికారులు స్పందించి స్వాధీనం చేసుకొని ఉపాధి పనులు చేసే కూలీలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎంపిపి


పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి

గజపతినగరం: క్రీడలతో మానసిక ఉల్లాసమని ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. మండలంలోని మరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలన్నారు. ఎంఇఒ. ఎస్.విమలమ్మ మాట్లాడుతూ ఈ పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలన్నారు. ఓటమి గెలుపుకు ప్రథమ మెట్టు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి, సర్పంచ్ లంక రామలక్ష్మి, బెల్లాన త్రినాథరావు, సత్యనారాయణ, సర్పంచ్ గెద్ద రమేష్, సీనియర్ పీడీలు చింత సత్యనారాయణ, లంక సునీత, పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు.. మేల్కొన్న సిబ్బంది

తెర్లాం: మండలంలోని పెరుమాలి జంక్షన్ నుంచి నెమలాం, చుక్కవలస, పాములవలస, నెమలాం, సుందరాడ గ్రామాలకు వెళ్లే మార్గంలో విద్యుత్ వైర్లు బుధవారం తెగి రోడ్డుపై పడ్డాయి. నిర్లక్ష్యంగా విద్యుత్ లైన్లు వేయడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని, ఇటీవల ఎమ్మార్ అగ్రహారంలో విద్యుత్ వైర్ తెగి ఒక వ్యక్తి చనిపోయిన సంగతి తెలిసిందేనని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. వైర్లు తెగి పడిపోయిన విషయాన్ని తెలుసుకున్న అధికారులు హుటాహుటీన అక్కడకు చేరుకుని వాటిని సరిచేశారు. ఎఇ సోమేశ్వరరావు మాట్లాడుతూ రెండు వైర్లు కండక్టర్ వద్ద కాకి వాలడంతో వైర్లు తెగిపోయాయని వాటిని వెంటనే సరిచేశామని చెప్పారు

రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు

చీపురుపల్లి: గడచిన మూడేళ్లలో రూ.1.50కోట్లు జిల్లా పరిషత్ నిధులు తీసుకు వచ్చి పలు అభివృద్ధి పనులను చేసామని జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీషా తెలిపారు. జెడ్‌పిటిసిగా ఎన్నికై మూడేళ్లు అవుతున్న సందర్భంగా తన కార్యాలయంలో వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడుతో కలసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. జెడ్‌పిటిసిగా తనను మండల ప్రజలు ఎన్నుకొని మూడేళ్లు పూర్తైందన్నారు. ఈ మూడేళ్ల కాలంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌ల సహకారం, సూచనలతో మండలంలో పలు అభివృద్ధి పనులు నిర్వహించామన్నారు. మండలంలో ప్రతి గ్రామానికి అవసరమైన సిమెంట్ రోడ్లు, డ్రైనేజి, తాగునీరు బోర్లు, ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కి అవసరమైన మౌలిక సదుపాయాలు, పాఠశాలల్లో టాయిలెట్స్ వంటి వాటిని గుర్తించి పనులు పూర్తి చేశామని చెప్పారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

నెల్లిమర్ల: ఉపాధ్యాయుల సమయపాలన పాటించాలని ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఈపు విజయకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, రెసిడెన్సియల్ ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు యూ డైస్ అప్డేట్‌గా ఉండేలా చూడాలన్నారు. ఎండిఎం నాణ్యతగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు చూడాలన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, పాల్గొన్నారు.

చెరువు గండిని పూడ్చిన సొసైటీ సభ్యులు

శృంగవరపు కోట: మండలంలోని ధర్మవరం కోమటి చెరువు సోమవారం కురిసిన వర్షానికి పూర్తిగా నిండిపోయి చెరువు గట్టు గండి పడింది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానికులు వెంటనే తాత్కాలిక మరమ్మత్తులు చేసినప్పటికీ నీరు వృథాగా పోతుండడంతో అన్నమరాజుపేటకు చెందిన ఫిషర్మెన్ సొసైటీ సభ్యులు తమ సొంత ఖర్చులతో కోతకు గురైన చెరువు గట్టును నిర్మించినట్లు ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసియ్య తెలిపారు.

గంజాయి నివారణకు పటిష్ట చర్యలు

బొబ్బిలి: గంజాయి నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని రైల్వే సిఐ ఎ. రవికుమార్ అన్నారు. స్థానిక రైల్వే పోలీసు స్టేషన్ ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిషా నుంచి గంజాయి దిగుమతి అయ్యే అవకాశం ఉందని, గంజాయి నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా రైల్వే స్టేషన్, రైళ్లలో దొంగతనాలు నివారణపై నిఘా పెడుతున్నామన్నారు. రైల్వే ప్లాట్ ఫామ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే గుర్తించి విచారణ చేయాలని రైల్వే పోలీసులను ఆదేశించామన్నారు.

స్టేట్ సిలబస్ ప్రకారం పరీక్షలు

మెరకముడిదాం: ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు స్టేట్ సిలబస్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తామని గర్భాం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డివిఎస్ అరుణ తెలిపారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సిలబస్ గురించి ఆందోళన చెందనవసరం లేదని, త్వరితగతిన సిలబస్ పూర్తి చేసి అక్టోబర్ రెండవ వారం నుంచి ఎఫ్ఎ 2 పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటి వద్ద ఏం చదువుతున్నారో దృష్టి పెట్టి, టీవిలకు, సెల్ ఫోన్‌లకు దూరంగా ఉంచి, రెగ్యులర్‌గా పాఠశాలకు పంపిస్తే చాలు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిఒ 7 ప్రకారం జీతాలు చెల్లించాలి

విజయనగరం టౌన్ : క్లాప్ వెహికల్ డ్రైవర్లకు జీవ 7 ప్రకారం వేతనాలు పెంచి చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరుమామిళ్ళ సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. క్లాప్ వెహికల్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఎపి స్వచ్ఛాంధ్ర క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో బుధవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 7 ప్రకారం క్లాప్ డ్రైవర్లకు చెల్లిస్తామన్న రూ.18,500లో కాంట్రాక్టర్లు కొంత మింగేస్తూ రనూ.10వేల మాత్రమే ఇస్తున్నారని అన్నారు. కార్మికులకు ఇఎస్ఐ కూడా అమలు కావడం లేదన్నారు. న్యాయం చేయండి అని అడిగేవారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస మౌళికావసరాలైన వారంతపు సెలవులు, పండుగ సెలవులు, సంపాదిత సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు

సిఎంను కలిసిన కర్రోతు



తనను మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్‌గా నియమించిన సిఎం చంద్రబాబును బుధవారం అమరావతిలో కర్రోతు బంగార్రాజు కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాధ్యతగా పని చేయాలని సిఎం సూచించినట్లు కర్రోతు తెలిపారు.

ప్రజాశక్తి- భోగాపురం

రేషన్ బియ్యం పక్కదారి

- గోదాం నుంచి నేరుగా బయటకు
- గోనె సంచులను మార్చి తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి- రాజాం

పట్టణంలో రేషన్ బియ్యం పక్కదారి పడుతుంది. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి బియ్యాన్ని అక్రమంగా కొంత మంది వ్యక్తులు తరలిస్తు కనిపించారు. వాస్తవానికి మార్కెట్ యార్డ్‌లో ఉన్న సివిల్ సప్లయ్ గోదాం నుంచి లారీతో ఉచిత బియ్యం డిపోలకు పంపిణీ చేస్తారు. అయితే బియ్యం పంపిణీ చేస్తున్న కొంతమంది వ్యక్తులు అక్రమంగా బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు తెలిస్తోంది. లారీలకు కొన్ని బస్తాలను ఎక్కించి


గోదాం నుంచి బయటకు తరలిస్తున్న వెనుక పక్క మార్గం ఇదే..

మరి కొన్ని బస్తాలను గోనులు మార్చి పక్కదారి పట్టిస్తున్నారు. ఈ బియ్యాన్నే తిరిగి కిలో రూ.35 నుంచి రూ.40కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

గోదాం బయట తాళాలు

అక్రమాలు బయటకు కనిపించకుండా సివిల్ సప్లయ్ గోదాం బయట తాళాలు వేసి లోపల పనులు చేస్తున్నట్లు సమాచారం. గోదాం నుంచి పక్కదారి పట్టిస్తున్న బియ్యం బస్తాలను గోదాం వెనుక ఉన్న ప్రహరీ గోడ సందు నుంచి బయటకు తరలిస్తున్నారు. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను ఏంటి ఈ బస్తాలు అని ప్రశ్నించగా యూరియా బస్తాలు అని వెటకారంగా చెప్పడం గమనార్హం.

ఇక్కడ నుంచే డిపోలకు సరఫరా

రాజాం సివిల్ సప్లయ్ గోదాం నుంచి రాజాం నియోజకవర్గంలోని పలు మండలాల రేషన్ షాప్‌లకు లోడ్ చేసినప్పుడు కనీసం సూపర్‌వైజర్ కూడా లేకుండా ఇష్టానుసారంగా లోడ్ చేయడం అనమానాలకు తావిస్తుంది. ఈ గోదాం నుంచి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇలా ప్రతి రోజు బియ్యం బస్తాలను


గోనె సంచి మార్చి బియ్యాన్ని తరలిస్తున్న అక్రమార్కులు

తరలిస్తున్నా రెవెన్యూ సిబ్బంది కనీసం స్టాక్ ఓపెనింగ్, తరువాతకి ఎంత తేడా ఉందో కూడా పరిశీలించడం లేదని సిబ్బందే చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, బియాన్ని అక్రమంగా తరలించకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

బెల్టు షాపులను అరికట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని వెంకటరాయుడుపేట గ్రామంలో బెల్టు షాపులు అరికట్టాలని సిపిఎం పార్టీ శాఖ మహాసభ తీర్మానించింది. బుధవారం గ్రామంలో సిపిఎం పార్టీ మహాసభ శాఖ కార్యదర్శి బి.రవణమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం మాట్లాడుతూ వెంకటరాయుడిపేట గ్రామంలో విచ్చల విడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని దీని వల్ల పిల్లలు చెడిపోయి ఏ అగత్యానికి పాల్పడతారోనని మహిళలు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాఖా కార్యదర్శి బి. రమణమ్మ గ్రామంలో తక్షణం మద్యం అమ్మకాలు ఆపాలని, గ్రామంలో కాలువలు రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి పి.శంకర్రావు, పార్టీ సభ్యులు సింహాచలం, అమ్మలక్ష్మి, శకుంతల, కళావతి, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులు రాజకీయం చేస్తే ఉద్వాసన

ప్రజాశక్తి - వేపాడ

ప్రభుత్వ అధికారులు గ్రామాలను అభివృద్ధి చేయకుండా రాజకీయాలు చేస్తే ఉద్వాసన తప్పదని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఎంపిపి డి. సత్యవంతుడు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ ఈ మండలం వ్యవసాయ ఆధారిత మండలమని రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. గృహ నిర్మానాలు, విద్యుత్ సౌకర్యం, గ్రామీణ రహదారుల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి మంజూరవుతున్న ఎన్ఆర్ఇజిఎస్ నిధులు సర్పంచ్ ఆధ్వర్యంలోనే ఉండాలని, ప్రభుత్వాలు మారినంత మాత్రాన సుప్రీం కోర్టు ఆదేశాలు మారవని అధికారులు అది గమనించి పని చేయాలని చెప్పారు. ఏ అధికారైనా నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీకు తొత్తులుగా వ్యవహరించి అభివృద్ధిని అడ్డుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, పంచాయతీ విస్తరణ అధికారి జి ఉమా, మాజీ డిసిసిబి చైర్మన్ వి.వి చిన్నరామునాయుడు, డిటి సన్యాసినాయుడు, మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశంలో జెడ్‌పి చైర్మన్


మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

అగ్నిప్రమాద బాధితుడుకు రూ.లక్ష అందజేత

మండలంలోని సోంపురం గ్రామానికి చెందిన జాగరపు ప్రకాష్ పరవాడ పార్మాసిటీ అగ్నిప్రమాదంలో గాయపడిన సంగతి తెలిసిందే. ఆయనకు వైసిపి తరుపున జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రూ. లక్ష చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మాజీ వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డిసిసిబి మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, మూకల కస్తూరి, ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, జెడ్‌పిటిసి శానాపతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వారిద్దరినీ అరెస్టు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-బొబ్బిలి


నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించే సిబిఎం పాఠశాల స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా అమ్మినవారిపైన, కొనుగోలు చేసిన వారిపైన కేసులు పెట్టి అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ పి.శంకరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి రామ్ శ్రీనివాస్, ఇఫ్టు నాయకులు ఎం.గోపాలం, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. సిబిఎం పాఠశాల అక్రమ రిజిస్ట్రేషన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం వామపక్షాలు ఆధ్వర్యంలో పాఠశాల ఎదురుగా రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలి, పరిసర ప్రాంతాలు పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించే సిబిఎం పాఠశాల స్థలాన్ని కరస్పాండెంట్ రత్నకుమార్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ వెనుక అవినీతి జరిగిందని విమర్శించారు. రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు అక్రమాలకు పాల్పడి రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి పాఠశాల స్థలాన్ని అమ్మినవారిపైన, కొనుగోలు చేసిన వారిపైన కేసు నమోదు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాలను ప్రస్తుతం ఉన్న భవనంలో కొనసాగించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, ఫాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు కె.అదృష్టకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు

ప్రజాశక్తి - నెల్లిమర్ల


పి. దుర్గాప్రసాద్

నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పోలు బోతు దుర్గా ప్రసాద్, పసుమర్తి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 1న రాజస్థాన్ జైపూర్ వరల్డ్ ట్రెడ్ మార్క్ మాలవ్య నగర్‌లో జరగనున్న ఫ్యాన్ ఇండియా ఎన్‌జిఒ కాన్‌క్లేవ్ కార్యక్రమంలో2023-24 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ తరపున ఉత్తమ ఎన్‌జిఒ సంఘంగా సాధన యువజన సంఘం ఎంపికైందన్నారు. నిరంతరం రక్తదాన శిబిరాలను నిర్వహించడంతో పాటు రక్తదాతలకు అవగాహన కల్పిస్తూ రక్తదానం చేయడానికి ప్రోత్సహించడం వంటి సేవా కార్యక్రమాలను గుర్తించి ఉత్తమ ఎన్‌జిఒ సంఘంగా జాతీయ స్థాయిలో ఎంపిక చేశారని తెలిపారు. ఈ మేరకు గుంటూరు జిల్లాలోని తాడేపల్లిలో ఉన్న స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్, స్టేట్ బ్లడ్ సెల్ ఎమ్‌డి డాక్టర్ వై.కామేశ్వర్ ప్రసాద్ నుంచి ఉత్తుత్తర్వులు అందాయని చెప్పారు. సాధన యువజన సంఘం ఎంపికపట్ల అధ్యక్షులు పోలుబోతు దుర్గా ప్రసాద్‌ను సంఘం సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

'కడలి'కి జీవితకాల సాఫల్య పురస్కారం

నెల్లిమర్ల: జరజాపుపేటకు చెందిన చిత్ర కారుడు, రిటైర్డు ఉపాధ్యాయులు కడలి ప్రకాశరావుకు జీవితకాల సాఫల్య పురస్కారం లభించింది. హైదరాబాదు సాహితీ సాంస్కృతిక కళా సంస్థ ఆదర్శ కళా నిలయం ఆధ్వర్యంలో లైఫ్ టైం ఎచివ్‌మెంట్ అవార్డును బుధవారం అందజేశారు. కడలి ప్రకాశ రావు కవిత్వం, చిత్రలేఖనం వంటి అంశాల్లో ప్రతిభ కనబర్చినందుకు లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డును ఆదర్శ కళా నిలయం వ్యవస్థాపక అధ్యక్షులు చేరాల ప్రకాష్ సమక్షంలో దేవులపల్లి రామానుజరావు స్మారక కళా మందిరంలో తెలంగాణా ఐపిఎస్ అధికారి శ్రీరాంరెడ్డి భూక్యా చేతుల మీదుగా అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టివి, సినీ నటులు రాజేంద్ర కుమార్, గణేష్ రెడ్డి, జబర్దస్త్ కళాకారులు బిక్షు నాయక్, అప్పారావు, నవీన్, వినోద్, ఫోక్ సింగర్ ఉష, అభినవ్ సర్దార్, దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొని కడలి కవితా ప్రసూనాలు సంపుటి ఆవిష్కరించారు. కడలికి అవార్డు రావడం పట్ల గ్రామస్థులు అభినందించారు.

మైనర్లను లైంగికంగా వేధిస్తే పోక్సో కేసు

డిఎస్‌పి పి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- బొబ్బిలి

మైనర్లను లైంగికంగా వేధిస్తే పొక్సో కేసు నమోదు చేస్తామని డిఎస్‌పి పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో లైంగిక వేధింపులు, డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి భవిష్యత్తుకు విద్యార్థి దశలోనే పునాదులు వేసుకోవాలన్నారు. పాఠశాల, బయట, ఇంటిలో ఎటువంటి సమస్య వచ్చినా తల్లిదండ్రులకు, పోలీసులకు చెప్పాలన్నారు. బాగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. ఆకర్షణకు లోనవ్వకుండా క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలన్నారు. ఆడపిల్లలను లోబరుచుకునేందుకు కొంతమంది గిఫ్టులు, ఇతర వస్తువులు ఇచ్చినా తిరస్కరించి ఫిర్యాదు చేయాలన్నారు. పాఠశాలలో ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేస్తామని, ఎటువంటి ఇబ్బందులు ఉన్న ఈ బాక్స్‌లో ఫిర్యాదు లెటర్ వేసిన, ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన రహస్యంగా దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆడపిల్లలకు ఎటువంటి సమస్య వచ్చిన పోరాడాలని కోరారు. ఆడపిల్లలు పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన, అసభ్యంగా మాట్లాడిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సెల్ ఫోన్లను మంచికి వినియోగించాలని, చెడుకు వాడవద్దని సూచించారు. చదువుతో పాటు ఆటలలో ముందుండాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్ తీసుకుంటున్న వారి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, సైబర్ నేరాలు బారిన పడకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక జెడ్‌పి పాఠశాలలో బొబ్బిలి రూరల్ సిఐ కె.నారాయణరావు, ఎస్ఐ జె. తారకేశ్వరరావు విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా చర్యలు, సైబర్ నేరాలకు గురి కాకుండా ఎలా దూరంగా ఉండాలనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'తో రైతుకు మేలు

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని పేరుమాలి సేవా కేంద్రం పరిధిలో బుధవారం ఎఒ సునీల్ కుమార్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత, తెగుళ్ల నివారణ, ఉద్యానవన పంటల యాజమాన్యం, పాడి రైతులకు పశుభీమా, టీకాలు ప్రాధాన్యత గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి మోహన్ కృష్ణ, మండల పశువైద్యాధికారి నరేంద్ర, నాయకులు సాగిరాజు అప్పలనరసింహారాజు, రైతులు పాల్గొన్నారు.

గంట్యాడ: రైతులు సేంద్రియ పద్ధతిలో పండించే వ్యవసాయానికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఎఫ్‌పిఒ, సిఇఒ ఎ.ప్రభాకర్ అన్నారు. మండలంలోని తాటిపూడి గ్రామంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ లావణ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒఎన్‌డిసి కోటాలో ఉత్పత్తులను అధికంగా దిగుబడి చేస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ద్వారా పండించిన ఉత్పత్తులకు శ్రీఆంజనేయ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ద్వారా ఐఎన్‌డి, జిఎపి సర్టిఫికేట్‌ను ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ రామచంద్రరావు, గ్రామ పెద్ద చౌదరి, వసాది, డి.కె.పర్తి యూనిట్ ఇన్చార్జులు లక్ష్మి, గాయత్రి, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెం, బి.రాజేరు రైతు సేవ కేంద్రాల్లో పోలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు మండల వ్యవసాయ అధికారి పివి. మల్లికార్జున రావు బుధవారం యాజమాన్య పద్దతులపై అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయ సాగు ప్రోత్సాహంలో భాగంగా సిబ్బంది వివిధ రకాల కషాయాల తయారీని ప్రయోగ పూర్వకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గొల్లపాలెం పశుసంవర్ధక అధికారి డాక్టర్ జగన్మోహన్, వ్యవసాయ సహాయకులు ముస్తఫా, పశుసంవర్ధక సహాయకులు సత్యనారాయణ, ఎఎంసి మార్కెటింగ్ సూపర్‌వైజర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: తంగుడుబిల్లి, సతివాడ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పట్టు పరిశ్రమ అధికారి ఎవి సొల్మన్ రాజు సతివాడ గ్రామంలో సమావేశం నిర్వహించి పట్టు పురుగు, మల్బరి మొక్కలు పెంపకానికి ఇస్తున్న రాయితీపై వివరించారు. రైతులు పట్టు పురుగులు, మల్బరి మొక్కలు పెంపకం వైపు మొగ్గుచూపాలని కోరారు. పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ పశువులలో వచ్చిన వ్యాదులు నివారణ, అధిక పాల ఉత్పత్తి, వ్యాక్సిన్ గురుంచి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎం. పూర్ణిమ, డిఆర్‌సి వ్యవసాయ అధికారి సంగీత, నీటి పారుదల శాఖ ఎఇ సంతోషి, ఎఇఒ నాగరాజు, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

డెంకాడ: బంటుపల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మోతాదుకు మించి రసాయనికి ఎరువులు, పురుగు మందులు వాడరాదని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ పి. నిర్మల, ఏరువాక కేంద్రం సమన్వయ కర్త కె.లక్ష్మన్, కీటక శాస్త్రవేత్త ఎం. స్వాతి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని కారాడ, పారాది గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ, ఉద్యాన వన శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడి యం. శ్యాంసుందర్ మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం ఉత్తమమని, వేస్ట్ డికంపోజర్ ద్వారా వ్యవసాయం లాభదాయక మని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి వెంకటరత్నం, టిడిపి మండల నాయకులు అల్లాడ భాస్కరరావు, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


రోడ్డుపై నిలిచిపోయిన భారీ వాహనాలు

పదే పదే కాజ్‌వే పాట్లు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

పారాది వేగావతి వంతెన కాలం చెల్లి ప్రమాద భరితంగా తయారవ్వడంతో దాని పక్క నుంచి కాజ్‌వే నిర్మాణ పనులు చేపట్టినా అది కాస్తా పదే పదే కొట్టుకుపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత మూడు నెలలుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాజ్‌వే ఇప్పటికి నాలుగు సార్లు వరద తాకిడికి కొట్టుకుపోయింది. ఇటీవల నూతనంగా నిర్మించిన కాజ్ వే మంగళవారం రాత్రి మళ్ళీ కొట్టుకుపోయింది. దీంతో గత మూడు రోజులుగా ఈ కాజ్‌వే మీదుగా ప్రయాణిస్తున్న వాహనాలకు బ్రేక్ పడింది. గతేడాది ఆగస్టు నెలలో రూ.13 లక్షలతో కాజ్ వే పనులు చేపట్టారు. పనులు పూర్తి చేసిన 15 రోజులకే అది కాస్తా కొట్టుకుపోయింది. మళ్ళీ ఈ ఏడాది మార్చి నెలలో రూ.94 లక్షలతో కాజ్‌వే పనులు చేపట్టినా అది కూడా ఇప్పటికి మూడుసార్లు కొట్టుకు పోయింది. దీనిపై ఆర్ అండ్ బి ఎఇ రాజును వివరణ కోరగా అధిక వర్షాలు కారణంగా కాజ్‌వే బలహీన పడుతుందని, పదే పదే నీటి ప్రవాహానికి కొట్టుకు పోయినా పాత కాంట్రాక్టరే (బివిఎస్ఆర్) పనులు చేస్తారని చెప్పడం గమనార్హం. కాగా కాజ్‌వే కొట్టుకోపోవడంతో వాహనాలు రోడ్డుపై నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ నియత్రణకు డిఎస్‌పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. అనంతరం కాజ్‌వేను డిఎస్‌పి పరిశీలించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహణ

ప్రజాశక్తి - రామభద్రపురం

చెకుముకి టాలెంట్ టెస్టు జిల్లాలోని అన్ని పాఠశాలల్లోనూ జెవివి ఆధ్వర్యాన బుధవారం జరిగింది. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ పరీక్షల ప్రశ్నాపత్రాలను బొబ్బిలి డిప్యూటీ డిఇఒ మోహనరావు, స్థానిక ఎంఇఒ తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో హేతువాద దృక్పదాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న ఈ టెస్టులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 300 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయడానికి ముందుకు వచ్చారని వీరిలో ప్రతిభ కనబరిచిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఇంచార్జి హెచ్‌ఎం నాగభూషణరావు, ఉపాధ్యాయ కార్యదర్శి మురళీధర్రావు, యుటిఎఫ్ మహిళ రాష్ట్ర బాధ్యులు కె.విజయ గౌరి, పాల్గొన్నారు.

కొత్తవలస: జెవివి ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్టుకు 520 మంది విద్యార్థులు హాజరైనట్లు జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ ఎల్. సత్యారావు తెలిపారు. కొత్తవలస జెడ్‌పిహెచ్ స్కూల్ హెచ్‌ఎమ్ సి.హెచ్.ఈశ్వరరావు, వియ్యంపేట డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ టి.



రామభద్రపురం: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జయశ్రీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు.

వేపాడ : సోంపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో విజయం సాధించిన వారు మండల స్థాయికి ఎంపికవుతారని పాఠశాల హెచ్‌ఎం బిపిఎ రాజు తెలిపారు.

భోగాపురం : జెడ్‌పి హైస్కూలులో 80 మంది విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్టు రాశారు.

డెంకాడ : జెడ్‌పి హైస్కూలులో జెవివి సమతా కన్వీనర్‌జి.నిర్మల ఆధ్వర్యాన అధిక సంఖ్యలో విద్యార్థులు పరీక్ష రాశారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు న్యూకాలని, పురిటిపెంట గ్రామం, గజపతినగరం మండలం, విజయనగరం జిల్లా కాపురస్తులు నడుకూరి భవాని పట్నాయక్ లేటు నర్సింగరావు పట్నాయక్ ఇచ్చిన బోగట్టపై పబ్లిక్ నోటీసు. సెల్ : 9000709854

నా క్లయింటు క్రింది వివరించిన షెడ్యూలు దాఖల నివాసము ఇల్లు షెటిల్‌మెంటు దస్తావేజు నెం. 2018/2002. తేది.16-10-2002న ఎస్‌ఆర్ఒ గజపతినగరం నందు పొందినారు. సదరు షెటిల్‌మెంటు దస్తావేజు ఒరిజినల్ నా క్లయింటు తే 11-08-2024 ఇంటి వద్ద నుంచి జెరాక్స్ కొరకు వెళ్లినపుడు పోయినది. గజపతినగరం పోలీసు స్టేషన్ వారికి తేది 12-09-2024 తెలియపరచగా వారు 19-09-2024 సదరు ఒరిజినల్ దస్తావేజు లభ్యం కాలేదని ధృవపత్రం జారి చేసితిరి.

సదరు ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనా దొరికిన ఎడల పై అడ్రసుగాని, క్రింది తెలియజేసిన న్యాయవాది గారికి గాని అందజేయగలరు.

ఎస్.కె.రాజ్‌కుమార్
న్యాయవాది, విజయనగరం
సెల్ : 9440570108

తేది: 24-9-2024
విజయనగరం

IN THE HONOURABLE COURT OF THE MACT-CUM-4TH ADDITIONAL DISTRICT JUDGE (SC'S AND ST'S) JUDGE COURT, AT SRIKAKULAM
MVOP. 10/2024.

Between:-
Talada Tirupathi Rao ...Petitioner
And:-
Kalidindi Ramanaraju @ Venkata Ramanamurty Raju @ Ramana Rao and 2 others. ...Respondents

To,
R-2: Venkata Reddy.S, S/o Manikya Reddy,
R/o Door No; 6-103, Patadappada,
Vizianagaram-535002,
Owner of Bus bearing No: **AP 35 Y 7557.**

NOTICE

Please take this notice in the above matter, that the above matter is posted to 03-10-2024 for your appearance. You are here by directed to appear before the above court **at 10.30 A.M On 03-10-2024** in person or through advocate without fail. Otherwise the matter will be decided in your absence.

// By Court Order //
MAJJI SAMPATH KUMAR
DHAVALA AMRUTHA,
ADVOCATES,
SRIKAKULAM, CELL 9440001170.